నేటి కందం- నేటికి అందం

బ్రెజి లధిపతి లూయిస్ తన
నిజమగు స్నేహితు డటంచు నేర్పరి మోడీ
సృజనాత్మకతకు రూపై
ప్రజలందరు మెచ్చ పెంచె వ్యాపారంబున్ !!

(ట్రంప్ సుంకాల పెంపు నేపథ్యంలో మోడీ తెలివిగా బ్రెజిల్ తో కొన్ని వ్యాపార సహకార ఒప్పందాలు ఈరోజు చేసుకున్నాడు..జై భారత్)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

దించుతాం గద్దెనంటూ
దినం శాపనార్థాలు
ప్రజలుతప్ప దించలేరు
ప్రగల్భాలు వ్యర్థాలు
అధికారం ఎవరికైనా
ఆయుష్షు ఐదేళ్లు
అంతవరకు విపక్షాలు
ఆగలేవా కొన్నాళ్లు



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 9-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:6 పేజీలు:6 వెల: రూ.1/-


## అమెరికాకు షాకిచ్చిన భారత్.. ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు తాత్కాలికంగా బ్రేక్



న్యూఢిల్లీ, ఆగష్టు 8:అగ్రరాజ్యం అమెరికా కు భారత్ షాకిచ్చింది. అమెరికాతో కీలకమైన ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు భారత్ తాత్కాలికంగా బ్రేకులు వేసింది. భారత ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనంగా 25 శాతం సుంకాలను విధించడంతో ప్రతిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనం ప్రచురించింది.

తాజా పరిణామాలతో ఇరుదేశాల మధ్య సంబంధాలు గత కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. భారత్ తాజాగా తీసుకున్న అనూహ్య నిర్ణయంతో సుమారు 3.6 బిలియన్ డాలర్ల విలువైన రక్షణ ఒప్పందాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఇందులో భారత సైన్యం కోసం స్ట్రైకర్ యుద్ధ వాహనాలు, జావెలిన్ యాంటీ-ట్యాంక్ క్షిపణులతోపాటు, నౌకాదళం కోసం ఆరు బోయింగ్ పీ-8ఐ గూఢచార విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలు కూడా ఉన్నాయి.

ఈ ఒప్పందాలను ఖరారు చేసేందుకు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలో వాషింగ్టన్‌లో పర్యటించాల్సి ఉండగా తాజా నిర్ణయంతో ఆ పర్యటన రద్దయినట్టు సమాచారం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌తో యుద్ధానికి భారత్ ఆర్థికంగా పరోక్షంగా సహకరిస్తోందని ఆగస్టు 6న డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. దాన్ని కారణంగా చూపుతూ భారత ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాన్ని విధించారు. దాంతో మొత్తం సుంకాలు 50 శాతానికి చేరాయి.

అయితే ట్రంప్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఐరోపా దేశాలు కూడా తమ ప్రయోజనాల కోసం రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్నాయని, తమను మాత్రమే అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించింది. అమెరికా గనుక రష్యాలా సమాన ధరకు చమురును సరఫరా చేస్తే, రష్యా నుంచి దిగుమతులు తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ తెలిపింది. ట్రంప్ బెదిరింపు ధోరణి, దేశంలో పెరుగుతున్న అమెరికా వ్యతిరేక జాతీయవాదం కారణంగా ప్రధాని మోదీకి ఈ విషయంలో రాజకీయంగా ముందుకు వెళ్లడం కష్టంగా మారిందని, అందుకే తాజా నిర్ణయం తీసుకున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అయితే ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య రక్షణ భాగస్వామ్యం, నిఘా సమాచార మార్పిడి, సంయుక్త సైనిక విన్యాసాలు యథావిధిగా కొనసాగుతున్నాయని భారత అధికారులు తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉన్న భారత్.. ప్రధానంగా రష్యాపై ఆధారపడినా ఇటీవలి కాలంలో ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికా నుంచి కొనుగోళ్లను పెంచింది.

## రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 3,038 పోస్టుల భర్తీకి కసరత్తు

హైదరాబాద్ ఆగస్టు 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 3,038 పోస్టుల భర్తీకి కసరత్తు మొదలయ్యిందని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని ఆయన గురువారం ఎక్స్ వేదికగా తెలిపారు. నియామకాల ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆర్‌టిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు వ్యక్తులు నిరుద్యోగులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని నమ్మొద్దని సజ్జనార్ నిరుద్యోగులను అప్రమత్తం చేశారు. ప్రభుత్వ అనుమతి మేరకే సంస్థలో పోస్టుల భర్తీకి కసరత్తు జరుగుతోందని, అడ్డదారుల్లో ఎవరికీ ఉద్యోగాలు రావని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఆర్‌టిసిలో ఉద్యోగాల పేరుతో ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే వెంటనే యాజమాన్యం దృష్టికి తేవాలని, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## అప్పటివరకు భారత్‌తో ఎలాంటి వాణిజ్య చర్చలు జరిపేదిలేదు.. తేల్చిచెప్పిన ట్రంప్



వాషింగ్టన్ ఆగస్టు 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వ్యవసాయం, డెయిరీ రంగాల్లో తమ కంపెనీల రాకను అడ్డుకుంటుండంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రగిలిపోతున్నారు. ప్రతీకార సుంకాలతో దారికి తెచ్చుకోవాలని చూశారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో రష్యా చమురు కొనుగోళ్లను సాకుగా చూపి భారత్ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించి తన అక్కసును వెళ్లగక్కారు. భారత ప్రభుత్వం కూడా అంతే స్థాయిలో స్పందిస్తుండటంతో ట్రంప్ మరింతగా రెచ్చిపోతున్నారు. సుంకాలపై వివాదం పరిష్కారమయ్యే వరకు భారతదేశంతో ఎటువంటి వాణిజ్య చర్చలు ఉండవని స్పష్టం చేశారు. 50 శాతం టారీఫ్‌ల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని ఆశించారా అని మీడియా అగిన ప్రశ్నకు 'లేదు, వివాదం పరిష్కారం అయ్యేవరకు చర్చల ప్రసక్తే లేదంటూ సమాధానమిచ్చారు. కాగా, భారత్‌పై మరో విడత ట్రారీఫ్‌లు వడ్డిస్తానని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్నారనే సాకుతో 25 శాతం చొప్పున వరుసగా రెండుసార్లు విధించిన టారిఫ్ ఇప్పటికే 50 శాతానికి చేరింది.

రష్యా నుంచి చైనా కూడా చమురును కొంటున్నప్పటికీ, కేవలం భారత్‌ను మాత్రమే ఎందుకు లక్ష్యం చేసుకున్నారని విలేకర్లు ప్రశ్నించినపుడు ట్రంప్ స్పందిస్తూ, "ఇప్పటికి ఎనిమిది గంటలే అయింది. చూద్దాం ఏం జరుగుతుందో" అన్నారు. "మీరు మరిన్ని చూడబోతున్నారు. మీరు తదుపరి ఆంక్షలను చూడబోతున్నారు" అని చెప్పారు. అయితే ట్రంప్ టారీఫ్‌లపై ప్రధాని మోదీ కూడా ధీటుగా స్పందించారు. దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడబోమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

అందుకోసం వ్యక్తిగతంగా ఎంత మూల్యం చెల్లించడానికైనా సిద్ధమేనని చెప్పారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ జయంతి సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. 'రైతుల ప్రయోజనాలకే మా అగ్ర ప్రాధాన్యత. రైతులు, పాడి రైతుల ప్రయోజనాలను పరిరక్షించడంతో భారత్ ఎన్నడూ రాజీపడదు' అని అన్నారు.

## పుతిన్‌కు మోదీ ఫోన్..

న్యూఢిల్లీ, ఆగష్టు 8:భారత ప్రధాన మంత్రి ×నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు ×వ్లాదిమిర్ పుతిన్ తో శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. "నా స్నేహితుడు అధ్యక్షుడు పుతిన్‌తో చాలా మంచి, వివరణాత్మక సంభాషణ జరిగింది. ఆయనకు భారతదేశంలో ఆతిథ్యం ఇవ్వడానికి నేను ఎదురుచూస్తున్నాను" అని మోదీ అన్నారు.

ఈ సందర్భంగా మోదీ, ఈ సంవత్సరం చివర్లో భారత్ లో జరగనున్న 23వ భారత్-రష్యా వార్షిక సదస్సు కు రావాలని పుతిన్‌ను ఆహ్వానించారు.

ఈ పర్యటన రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత పెంచుతుందని ఇరు నేతలు అభిప్రాయపడ్డారు.

ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చ..

ఈ ఫోన్ సంభాషణలో పుతిన్, ×ఉక్రెయిన్‌లో తాజా పరిణామాలు, తన దృక్పథాన్ని మోదీతో పంచుకున్నారు. భారతదేశం, శాంతియుత పరిష్కారానికి కట్టుబడి ఉందని మోదీ మరోసారి స్పష్టం చేశారు. మోదీ?పుతిన్, భారత్-రష్యా మధ్య ఉన్న ×ప్రత్యేక, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. గత సమావేశాల నుండి సాధించిన పురోగతిని కూడా సమీక్షించారు.

## కాసేపట్లో భారీ వర్షం.. హైడ్రా హైఅలర్ట్..



హైదరాబాద్, ఆగష్టు 8:గత కొన్ని రోజులుగా హైదరాబాద్ సిటీలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. మరికాసేపట్లో నగరవ్యాప్తంగా కుంభవృష్టి కురిసే అవకాశముందని హైడ్రా హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు (శుక్రవారం) సాయంత్రం నుంచి రాత్రి దాకా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. వర్షం ప్రారంభం కాకమునుపే ప్రజలంతా ఇళ్లకు చేరుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన సమాచారం ప్రకారం, దక్షిణ, మధ్య తెలంగాణ ప్రాంతాల్లో క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు జోరుగా కురువనున్నాయి. గురువారం రోజున రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇప్పటికే భారీ వర్షాలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇదే తరహాలోనే శుక్ర, శనివారాలు కూడా జోరుగా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రధానంగా సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్ జిల్లాల్లో వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు పేర్కొన్నారు.

మరోవైపు, ఈ నెల 13వ తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో 13, 14, 15 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక

### - మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 8 (ఎక్స్ ప్రెస్ న్యూ స): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా లబ్ధిదారులను ఎంపిక చేశామని అన్నారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన 592 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పొంగులేటి ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పామని, పేదల ముఖంలో నవ్వు చూడటమే లక్ష్యం అని తెలియజేశారు. గత ప్రభుత్వం రెండుపడకల గదులను పార్టీ కార్యకర్తలు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇచ్చిందని అన్నారు. మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వం 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని కొనియాడారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులో భార్య పేరు, పిల్లల పేర్లు చేర్చే అవకాశం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లను జమచేశామని పొంగులేటి చెప్పారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని, రూ. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టిందని అన్నారు. బిసిలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వ చట్టం చేసిందని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని బిజెపి ఆమోదించలేదని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..



న్యూఢిల్లీ, ఆగష్టు 8: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎం ఉజ్వల యోజన కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. దాని కోసం రూ.12,060 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పింది. అసోం, త్రిపుర రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీకి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. రూ.7,250 కోట్ల చొప్పున ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. సాంకేతిక విద్య కోసం రూ.4,200 కోట్లు ప్రకటించినట్లు కేంద్రం వెల్లడించింది.

ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల అప్‌గ్రేడ్‌కు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. దేశీయ ఒఖఉలో నష్టాలకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు పరిహారం చెల్లించేందుకు రూ.30,000 కోట్లు కేటాయించినట్లు వివరించింది. మరక్కనం - పుదుచ్చేరి 4-లైన్ హైవే కోసం రూ. 2,157 కోట్లు కేటాయింపు జరిగినట్లు మోదీ సర్కార్ చెప్పుకొచ్చింది. అనంతరం అమెరికా విధించిన 50 శాతం సుంకాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది.

అమెరికా సుంకాలకు భారత్ దీటైన కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి ఆయుధాల కొనుగోళ్లు నిలిపివేసినట్లు భారత్ ప్రకటించింది. ఇప్పటికే అమెరికా క్షిపణుల కొనుగోళు నిలిపివేసినట్లు భారత్ తెలిపింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అమెరికా పర్యటన కూడా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఇటీవల భారత్‌పై 50 శాతం టారిఫ్ విధిస్తూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నిర్మల్ జిల్లాలో విషాదం.. రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆదిలాబాద్, ఆగష్టు 8: నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని రంగశివిని గ్రామనికి చెందిన పవార్ సచిన్ (32) గురువారం సాయంత్రం పార్డి బి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుభీర్ ఎస్ఐ ఏ కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సచిన్ తన స్వగ్రామం నుండి బైక్ పై కుభీర్ సంతకు వెళ్తున్నాడు.

ఈ క్రమంలో పార్డి(బి) గ్రామ సమీపంలో అడవి పంది అడ్డం రావడంతో అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొన్నాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలు కాగా తీవ్ర రక్తస్రావం అయింది. క్షతగాత్రుడిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

## డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఆర్డీఓ అశోక్ రెడ్డి



నల్గొండ, ఆగషు 8: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని నల్లగొండ ఆర్డీఓ యారాల అశోక్ రెడ్డి అన్నారు. కట్టంగూర్, నార్కట్‌పల్లి మండలాలకు చెందిన 20 మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్థికసాయం ప్రకటించింది. శుక్రవారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక సాయాన్ని దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు.

దివ్యాంగులు ఆర్థికంగా బలపడేందుకు మూడు సంవత్సరాల కాలంలో తెలంగాణలోని ఆరు జిల్లాలో 3 వేల మంది దివాంగులకు ఆర్థికసాయం అందించిన డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్ డీఓ శ్రవణ్ కుమార్, జిల్లా శిశు సంక్షేమ, వయో వృద్ధులు, దివ్యాంగ శాఖ అధికారిణి కృష్ణవేణి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డైరెక్టర్ పీఎన్ శ్రీనివాస్, డీఆర్డీఏ డీపీఎం మోహన్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ అస్రా అంజుం, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు, అర్ఐ కుమార్ రెడ్డి, ఏపీఎం రాము, ఎఫ్‌ఆర్ఓ నాగిరెడ్డి, సాయితేజ మణికంఠ, మహేశ్, ఓంప్రకాశ్, పాల్గొన్నారు.

## కారేపల్లి మండలంలో వన మహోత్సవానికి ఏర్పాట్లు

కారేపల్లి, ఆగస్టు 08 : కారేపల్లి మండలంలో వన మహోత్సవానికి ఎంపీడీఓ మల్లెల రవీంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం గేటుకారేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వన మహోత్సవంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. నాటిన మొక్కల రక్షణకు ఏర్పాట్లు చేయటం జరుగుతుందన్నారు. వన మహోత్సవంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కోటేశ్వరావు, కార్యదర్శి పార్వతి, టీఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# రక్షాబంధన్ - తోబుట్టువుల పవిత్ర ప్రేమకు ప్రతీక !

## (09 ఆగష్టు "రాఖీ పౌర్ణమి" సందర్భంగా)

రక్షణ బంధన్ ఒక పవిత్ర పర్వదినం. సోదరి, సోదరుల నడుమ పవిత్ర ప్రేమ, అనుబంధాలకు గుర్తుగా రాఖీ పండుగను నిర్వహించుకుంటాం. రాఖీ అంటే రక్షణ అని అర్థం. సోదర సోదరీమణుల జీవితాల్లో సుఖ సంతోష, శ్రేయస్సులను కోరుకునే పండుగ రాఖీ. రాఖీ పౌర్ణమి పండుగకు ప్రసిద్ధిగాంచిన జైపూర్, రాజస్థాన్‌ను "రాఖీ కిరీటంలో రత్నం"గా పిలుస్తారు. "రాఖీ పూర్ణిమ" లేదా "రక్షాబంధన్" అనబడే తోబుట్టువుల బంధానికి సంబంధించిన పవిత్ర పర్వదినంగా పేరు గాంచింది. సోదర సోదరీమణుల మధ్య ప్రేమకు ప్రతీకగా భావిస్తాం. సోదరికి సోదరులు రక్షణ కవచంగా ఏర్పడతామని హామీ ఇస్తూ, సోదరి కట్టిన రాఖీని అతి పవిత్రమైనదిగా భావిస్తారు. చెల్లి/అక్కలు అత్యంత భక్తి శ్రద్ధలతో అన్నలు/తమ్ముళ్ల చేతులకు రాఖీ కట్టి, తీపి తినిపిస్తూ, సోదరుల రక్షణను కోరుతుంది సోదరి. సోదరి కట్టిన రాఖీకి ప్రతిఫలంగా సోదరులు దీవెనలు ఇస్తూ, కొంత ధనాన్ని కూడా సోదరి చేతుల్లో పెట్టి సంతోష పెట్టడమే రాఖీ పండుగ ప్రత్యేకం. శ్రావణ మాస పూర్ణిమ రోజున, అనగా 09 ఆగష్టు 2035న నిర్వహించుకునే పర్వదినంగా రాఖీ పండుగకు భారతదేశం చిరునామాగా నిలుస్తున్నది. సౌభాగ్య యోగాని ప్రసాదించే రాఖీ పండుగ రోజున లక్ష్మి నారాయణుడిని పూజించి సోదరుడికి సోదరి రాఖీ కడితే శుభ కలుగుతుందని నమ్ముతారు. సోదరుడి తన సోదరి రాఖీ కట్టే సందర్భంగా మూడు ముడులు వేయడం శుభమని భావించడం జరుగుతుంది. మొదటి ముడి సోదరుడికి దీర్ఘాయుష్షును, రెండవ ముడి సోదరి దీర్ఘాయుష్షును, మూడో ముడి వారి మధ్య ప్రేమానుబంధ మాధుర్యాన్ని పెంచుతుందని నమ్ముతాం.

ద్రౌపది, శ్రీ కృష్ణుడి సోదర సోదరి అనుబంధం:

మహాభారతంలో శ్రీకృష్ణుడు శిశుపాలుడిని వధించే సందర్భంలో అతని వేలికి గాయం అవుతుంది. ఆ సమయంలో ద్రౌపది తన చీర కొంగును చించి కృష్ణుడి వేలుకు కడుతుంది. ఆమె చూపిన సోదరి ప్రేమకు ప్రతిఫలంగా, కృష్ణుడు ఆమెకు సదా రక్షణగా ఉంటానని హామీ ఇస్తాడు. ఆ తర్వాత దుశ్శాసనుడు ద్రౌపదినా నిండు సభలో వస్త్రాపహరణం చేయ ప్రయత్నించగా కృష్ణయ్య ఆమెకు అంతులేని చీరను ప్రసాదించి ఆమెను రక్షిస్తాడు. దీనినే రక్షణ బంధన్ పండుగకు మూలం అని భావిస్తారు. మరో వివరణ ప్రకారం, వృత్తాసురుడితో యుద్ధంలా ఇంద్రుడు ఓడిపోయే పరిస్థితిలో అతని భార్య ఇంద్రాణి రక్షణ దార బంధాన్ని కట్టి అతనికి శక్తిని అందించి విజయాన్ని చేకూర్చుతుంది.

ఇదే సాంప్రదాయంగా సోదర సోదరీమణుల మధ్య రాఖీ పండుగ రూపంలో జరుపుకుంటున్నాం. మేవార్ రాణి కర్ణావతి, గుజరాత్ సుల్తాన్ బహాదూర్ షా దాడి చేస్తున్న వేళ, తన రాజ్యాన్ని రక్షించమని మొఘల్ చక్రవర్తి హుమాయూన్‌కు రాఖీ పంపుతుంది. దీనికి ప్రతిగా హుమాయూన్ ఆమెకు సహాయపడి, ఆమె రాజ్యాన్ని కాపాడడం జరుగుతుంది. మతాలకు అతీతంగా జరిగిన ఈ సంఘటన కూడా రాఖీ పండుగకు కారణమని చెబుతారు. 1905 బెంగాల్ విభజన సమయంలో, బ్రిటీష్ పాలకులు హిందూ - ముస్లింల మధ్య చిచ్చు పెడతారు. అప్పుడు రాఖీ పండుగను ఐక్యతకు ప్రతీకగా రవీంద్రనాథ్ టాగూర్ ప్రయోగిస్తారు.

రాఖీ పండుగ వెనుక చరిత్ర ఏదైనప్పటికీ, సోదర సోదరీమణుల మధ్య ప్రేమను మరింత పటిష్ట పరిచే మాధ్యమంగా ప్రతి ఏట రాఖీ పండుగ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ఇది ప్రేమ, భద్రత, ఐక్యత, సామరస్యత, పవిత్ర బంధాలను గుర్తు చేస్తున్నది మన సురక్షా బంధన్. సోదర సోదరీమణులు తమ మధ్య నెలకొన్న చిన్న చిన్న విభేదాలను మరిచి తమ జీవితాల్లో ఆనందం తాండవించే విధంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించుకుంటున్నాం.

-డాక్టర్ ॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఐఎన్ఎస్ చిల్కాలో 01/25 బ్యాచ్ అగ్నివీరుల పాసింగ్ ఔట్ పరేడ్

న్యూఢిల్లీ, ఆగష్టు 8:ఆరో అగ్నివీర్ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ (పీఓపీ) 2025 ఆగస్టు 08న ఐఎన్ఎస్ చిల్కాలో నిర్వహించనున్నారు. ఈ వేడుకతో 300 మంది మహిళలతో కూడిన 2000 మందికి పైగా అగ్నివీరులకు ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తవుతుంది. వీరంతా 16 వారాలపాటు కఠినమైన శిక్షణ పొందారు.

అగ్నివీరులతో ప్రయాణంలో పీఓపీ చాలా ముఖ్యమైనది. ఎందుకంటే ఇది పోరాటానికి సిద్ధంగా ఉన్న, విశ్వసనీయత కలిగిన, పూర్తి సమన్వయంతో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న భారత నావికాదళంలో వారి ప్రయాణ ప్రారంభాన్ని తెలియజేస్తోంది. పాసింగ్ అవుట్ బ్యాచ్‌లో సీనియర్ సెకండరీ రిక్రూట్‌లు, నావిక్‌లు (సాధారణ విధులు) కూడా ఉన్నారు.

తూర్పు నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆధ్వర్యంలో పరేడ్ జరగనుంది. ఐఎన్ఎస్ చిల్కా కమాండింగ్ ఆఫీసర్ కమోడోర్ బీ దీపక్ అనీల్ కండక్టింగ్ ఆఫీసర్‌గా ఉంటారు.

సాయంత్రం వేళ జరిగే ఈ పరేడ్‌ను అగ్నివీరుల కుటుంబ సభ్యులు, ప్రముఖులు, క్రీడలకు సంబంధించిన ప్రముఖులు వీక్షించనున్నారు.

అధునాతన నావికా వ్యవస్థలపై సేవలందించేందుకు క్రమశిక్షణ, ధృడత్వం, వృత్తిపరమైన నైపుణ్యాలతో కూడిన సమర్థులైన యోధులుగా కొత్తగా నియామకమైన వారిని మార్చటంలో ఐఎన్ఎస్ చిల్కా కీలక పాత్ర పోషిస్తోంది.

ముగింపు కార్యక్రమనికి తూర్పు నావికా దళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ హాజరుకానున్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారితో పాటు ఛాంపియన్ విభాగానికి అవార్డులు లేదా ట్రోఫీలను ఆయన ఇవ్వనున్నారు. ద్విభాషా శిక్షణార్థుల మ్యాగజైన్ అయిన 'అంకుర్'ను ఆయన ఆవిష్కరించనున్నారు.

ఈ పరేడ్ భారత నావికాదళ యూట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్ పేజీ, ప్రాంతీయ దూరదర్శన్ నెట్‌వర్క్‌లో 2025 ఆగస్టు 08న సాయంత్రం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం కానుంది.

# ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో ఫీల్డ్ మార్షల్ సామ్ మానెక్ షా, బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్, మేజర్ సోమనాథ్ శర్మలపై అధ్యాయాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 8:సైనిక యోధుల జీవితం, త్యాగాలపై అధ్యాయాలను ఈ విద్యా సంవత్సరం ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో చేర్చారు. ఫీల్డ్ మార్షల్ మానెక్ షా సాహస గాథను ఎనిమిదో తరగతి (ఉర్దూ), బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్ జీవిత చరిత్రను ఏడో తరగతి (ఉర్దూ), మేజర్ సోమనాథ్ శర్మ జీవిత గాథను ఎనిమిదో తరగతి (ఇంగ్లిష్) సిలబస్‌లో చేర్చారు.

ధైర్యం, కర్తవ్యాలకు సంబంధించి స్ఫూర్తిదాయకమైన కథనాలను విద్యార్థులకు అందించడమే కొత్తగా ప్రవేశపెట్టిన ఈ అధ్యాయాల లక్ష్యం. భారత్‌లో ఫీల్డ్ మార్షల్ హోదా పొందిన మొదటి అధికారి సామ్ మానెక్ షా. అసాధారణ నాయకత్వ పటిమ, వ్యూహాత్మక చతురతకు పేరెన్నికగన్నారు. బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్ మహావీర చక్ర పురస్కారాన్ని పొందగా, మేజర్ సోమనాథ్ శర్మ పరమవీర చక్ర పురస్కార గ్రహీత. వారిద్దరూ మరణానంతరం ఈ అవార్డులు పొందారు. దేశసేవలో ప్రాణాలర్పించిన వారు మహోన్నత త్యాగానికి ప్రతీకలుగా నిలిచారు.

జాతీయ యుద్ధ స్మారక చిహ్నానికి (ఎన్‌డబ్ల్యూఎం) జాతీయ స్థాయి ఖ్యాతిని గడించే దిశగా.. విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ విద్యా పరిశోధన - శిక్షణ మండలి చేస్తున్న కృషిలో రక్షణ మంత్రిత్వ శాఖ పాలుపంచుకుంటోంది. ఎన్‌డబ్ల్యూఎం, సంబంధిత ఇతర అంశాలను పాఠ్య ప్రణాళికలో చేరుస్తోంది.

ఈ గాథలు, వాటిని పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా విద్యార్థులు భారత సైనిక చరిత్రను తెలుసుకోవడమే కాకుండా.. సంక్లిష్టతలను అధిగమించే సమర్థత, సహానుభూతి, భావోద్వేగ మేధ వంటి జీవిత పాఠాలనూ నేర్చుకుంటారు. దేశ పురోగతికి పాటుపడాల్సిన ఆవశ్యకతనూ గుర్తిస్తారు.

న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ప్రతిష్ఠాత్మక సెంట్రల్ విస్టా 'సి' హెక్సాగాన్‌లో ఉన్న జాతీయ యుద్ధ స్మారకాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2019 ఫిబ్రవరి 25న జాతికి అంకితం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరయోధులైన మన సైనికులకు నివాళి అర్పించడంతోపాటు.. ప్రజలందరిలో దేశభక్తి, ఉన్నత నైతిక విలువలు, త్యాగం, జాతీయతా స్ఫూర్తి, ఐక్యతా భావాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ స్మారక చిహ్నాన్ని నెలకొల్పారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసివేయాలని

## తహసీల్దార్‌కు వినతి

మెదక్, ఆగష్టు 8: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన 8మంది లబ్దిదారులు తహసీల్దార్ రజినికుమారికి తమ గోడు వెల్లబోసుకుని వినతి పత్రం అందజేశారు. తమకు ఇళ్లు మంజూరై ఇప్పటికే నెలరోజులు గడుస్తుందని ఇంత వరకు ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టలేదని తెలిపారు.

తమ ఇళ్లకు అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుండి తొలగిస్తే మా ఇండ్లకు పైన ఉన్న కేబుల్ ఇక అడ్డు రాదని తెలిపారు. దీంతో ఈ విషయమై సంబంధిత విద్యుత్ అధికారులకు చెప్పి సమస్యను పరిష్కరి స్తానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా విన్నవించడం జరిగిందన్నారు.అ బ్దిదారుల వెంట విద్యాసాగర్, మామిడి సిద్దరాములు తదితరులు ఉన్నారు.

# నమ్మకం లేదు.. కేసు సీబీఐకి అప్పగించాలి

హైదరాబాద్, ఆగష్టు 8: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు నేతలను విచారించిన సిట్ వారి నుంచి వాంగ్మూలాలను సేకరించిన విషయం తెలిసిందే.. అయితే ఈ కేసులో తాజాగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిట్ విచారణకు హాజరయ్యారు. బండి సంజయ్. కార్యకర్తలు, నేతలు వెంటరాగా భారీ ర్యాలీగా దిల్‌కుశ గెస్ట్ హౌస్‌కు వెళ్లారు. ఈ కేసులో బండి సంజయ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు ) రికార్డ్ చేశారు. అంతకుముందు హనువమాన్ ఆలయంలో బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేదు..

సిట్ విచారణకు హాజరయ్యే ముందు బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య దోస్తీ ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదన్నారు. అందుకే ఈ అంశంలో సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అత్యధికంగా తన ఫోన్‌కాల్స్ ట్యాప్ చేశారని బండి సంజయ్ ఆరోపించారు.

కీలక ఆధారాలు అందజేత

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను కేంద్ర మంత్రి సెట్ అధికారులకు సమర్పించినట్లు సమాచారం. కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ కుమార్, మంత్రి పీఆర్ఓ పసునూరు మధు, మాజీ పీఏ పోగుల తిరుపతి కూడా సిట్ ముందు హాజరయ్యారు. ఇదిలావుంటే ఫోన్ ట్యాపింగ్ కేసును భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశంగా పరిగణిస్తోంది. సిట్ విచారణ తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా కూడా లేదన్నారు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్. కేసీఆర్‌ను జైలులో పెడతా మని గతంలో ప్రకటించిన ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి . ఇప్పుడు అలాంటి దేమీ లేదంటున్నారని విమర్శించారు.

ఫోన్ ట్యాపింగ్ అయినట్లు నిర్ధారణ!

ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి కేంద్ర నిఘా సంస్థల నుండి కీలకమైన సమాచారాన్ని సేకరించారు. కేసీఆర్ ప్రభుత్వం బండి సంజయ్ ఫోన్‌ను విస్తృతంగా ట్యాప్ చేసిందని నిఘా సంస్థలు నిర్ధారించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బండి సంజయ్ ఫోన్ నిరంతరం ట్యాప్ చేసినట్లు నిర్ధారించారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంపై కేంద్ర నిఘా సంస్థలు ఆధారాలు సేకరించాయి. నిఘా సంస్థల నుండి సేకరించిన ఆధారాలను కేంద్ర మంత్రి సిట్ అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది.

### కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్

ఇదిలావుంటే, మునుగోడు ఉప ఎన్నికల టార్గెట్‌గా జరిగిన ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు అప్పుడే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి బండి సంజయ్ కొన్ని ఆధారాలు అందజేశా రంటున్నారు. సిట్ బృందానికి ఆధారాలు ఇవ్వడమే కాదు.. కేసును సీబీఐకి అప్పగించాలని కూడా ఇప్పుడు బండి సంజయ్ డిమాండ్ చేస్తున్నారు. ట్యాంపిగ్ కేసును జాతీయ స్థాయిలో పెద్ద అంశంగా తీసుకోవాల నుకుం టోంది తెలంగాణ భారతీయ జనతా పార్టీ. నాడు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్ రావు టీమ్ చాలా మంది నేతల ఫోన్లు ట్యాప్ చేసిందన్నదీ ఆరోపణ.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్ హనుమంతరావు





నల్గొండ, ఆగషు 8: పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండల తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఇప్పటివరకు ఎన్ని ఫైల్స్ క్లియర్ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని పరిశీలించారు. అనంతరం జూలూరు- రుద్రవెల్లి లో లెవెల్ బ్రిడ్జిపై మూసీ వరద నీటిని పరిశీలించారు. వరద నీటిలో చెత్తాచెదారం కొట్టుకరావడంతో వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, గ్రామ పంచాయతీ కమిటీ భవనాల్లో ఉండాలన్నారు. అలాగే శిథిలమైన భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలో వర్షం వస్తే జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నీళ్లు వేడి చేసి తాగాలని సూచించారు. వర్షపు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. మూగ జీవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వ్యాక్సిన్, మందులు వేయాలని, వినియోగదారులకు డాక్టరుఅందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ సదస్సులో పెద్ద చెరువు భూములు, భూదాన భూములు, వక్ఫ్ బోర్డు భూములపై దరఖాస్తులు వచ్చాయని, వాటిని నిశితంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డీటీ నాగేశ్వరరావు, ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి ఉన్నారు.

# అనాథ ఆడపిల్లలకు ఆర్థిక సాయం

నల్లగొండ, ఆగస్టు 08 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడకమళ్ల వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఆయన ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా దిక్కుతోచని పరిస్థితిలో ఉండడంతో వారికి శుక్రవారం నల్లగొండ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మాతంగి వీరబాబు రూ.6,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకన్న కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ శాఖ ఉద్యోగులు రంగోజు గిరిధర్, మారంరాజ్ వంశీ, ఎండీ నజీర్, కత్తుల నేతాజీ, వీరితో పాటు తుంగతుర్తికి చెందిన మొగలగాని వంశీ గౌడ్, అంబటి రాములు, తడకమళ్ల రవికుమార్, అంబటి ప్రసన్న పాల్గొన్నారు.

# హన్మకొండలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ



హన్మకొండ, ఆగష్టు 8: (నేటినిజం ప్రతినిధి)హన్మకొండ బాలసముద్రం కాళోజీ కళాక్షేత్రం నందు వరంగల్ పశ్చిమ నియోజక వర్గ లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ ,హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం రాండమైజేషన్ ద్వారా ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, హనుమకొండ వరంగల్ జిల్లా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనతో నిరుపేదలకు కష్టాలు

## - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


హైదరాబాద్, ఆగష్టు 8: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధపాలన విధానాలతో నిరుపేదలు బతికే పరిస్థితులు లేకుండా పోయిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో జూబ్లీహిల్స్ నియోజవర్గం ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నేతలతో ఎమ్మెల్యే కృష్ణారావు సమావేశం నిర్విహించి బూత్‌స్థాయి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం అన్ని రంగాలలో నెంబర్‌వన్‌గా అభివృద్ధిని సాధించిందన్నారు.

కానీ, నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన విధానలతో నిరుపేదలు అవస్థలు పడుతున్నారని, చిరువ్యాపారుల నుంచి బడా వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు.

కాలనీలు, బస్తీలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా పూర్తిగా విఫలమౌతున్నారన్నారు.

దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ నాయకత్వంలో జూబ్లీహిల్స్ అదర్శవంతంగా అభివృద్ధి చెందిందని, ఆయన అకాల మరణం తీరనిలోటన్నారు. ఈ ఉప ఎన్నికలలో బీఆర్ఎస్‌ను గెలిపించడమే మాగంటికి నిజమైన నివాళి అని అన్నారు.

కార్యక్రమంలో కోఅర్డినేటర్ సతీష్ఆరోరా, కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, ముద్దం నర్సింహాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్‌గౌడ్, పగుడాల శిరీషాబాబురావు, మహేశ్వరిశ్రీహరి, సబీహాగౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రావణ్‌కుమార్, జిల్లా మైనార్టి అధ్యక్షుడు గౌసుద్దీన్, ఎర్రగడ్డ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ, షరీఫ్‌కురుసీ, జావిద్, అజీముద్దిన్, సయ్యుద్రూసాల్, బాలు, నర్సింగరావు, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, బద్రీద్దున్, భుజంగరావు, శ్రీకాంత్, తరుణ్, రవి, జవహార్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.





# ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి.. భార్యను హత్య చేసిన భర్త

భువనేశ్వర్, ఆగష్టు 8: ఒక వ్యక్తి తన ఇద్దరు ప్రియురాళ్లతో కలిసి భార్యను హత్య చేశాడు. ఆత్మహత్యగా నమ్మించేందుకు ప్రయత్నించాడు. అత్త ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ వ్యక్తిని, ఇద్దరు ప్రియురాళ్లను అరెస్ట్ చేశారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బెల్లగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని నుగావ్ గ్రామానికి చెందిన 30 ఏళ్ల సంతోష్ నాయక్ రోజువారీ కూలీ. 28 ఏళ్ల భార్య పూజతో 12 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి నలుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కాగా, సంతోష్ నాయక్‌కు ఇద్దరు ప్రియురాళ్లు ఉన్నారు. 26 ఏళ్ల అనితా నాయక్, 21 ఏళ్ల శ్రుతి పరిదాతో అతడికి వివాహేతర సంబంధం ఉండటంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 4న పూజా అనుమానాస్పదంగా మరణించింది.

మరోవైపు తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని పూజా తల్లి శాంతికి సంతోష్ సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె హుటాహుటిన కుమార్తె ఇంటికి చేరుకున్నది. కూతురు పూజ మృతదేహాన్ని గుడ్డలో చుట్టి నేలపై ఉంచడాన్ని ఆమె గమనించింది. అయితే అత్తను తన ఇంట్లోకి సంతోష్ అనుమతించలేదు. ఆమె కుమార్తె మృతదేహాన్ని దగ్గర నుంచి చూడనివ్వలేదు.

కాగా, పూజా తల్లి శాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అల్లుడు సంతోష్‌కు ఇద్దరు మహిళలతో వివాహేతర సంబంధం ఉన్నదని, భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆరోపించింది. ఈ నేపథ్యంలో వారిద్దరితో కలిసి తన కుమార్తెను సంతోష్ హత్య చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు.

మరోవైపు పూజా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెను హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో సంతోష్, అతడి ఇద్దరు ప్రియురాళ్లైన అనిత, శ్రుతిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# గనుల రంగంలో సంస్కరణలపై శ్రీ జి. కిషన్ రెడ్డి అధ్యక్షతన మేధోమథన సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 8:గనుల రంగంలో సంస్కరణలపై ఉన్నతస్థాయి మేధోమథన సమావేశం ఈ రోజు న్యూఢిల్లీలో జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబేతో కలిసి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు.

దేశంలో గనుల రంగ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడానికి అవసరమైన నియంత్రణ, నిర్మాణాత్మక కార్యాచరణ సంబంధిత సంస్కరణలపై పరిశ్రమ నాయకులు, వాటాదారులతో చర్చించడం ఈ సమావేశపు ఉద్దేశం. 2047 నాటికి వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

టాటా స్టీల్, జేఎస్ డబ్ల్యూ, వేదాంత, అదానీ, హిందాల్కో సహా ప్రముఖ మైనింగ్, మెటల్ కంపెనీలకు చెందిన 45 మందికి పైగా సీనియర్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియలు, అనుమతులు, రవాణా, సుస్థిరమైన మైనింగ్ పద్ధతులకు సంబంధించిన ఆచరణాత్మక ఆలోచనలను వారు పంచుకున్నారు. విధానపరమైన అంశాలను, సవాళ్లను గురించి కూడా చర్చించారు. సమావేశంలో ఉత్పన్నమైన పలు సందేహాలకు మంత్రిత్వ శాఖ సమాధానాలు ఇచ్చింది. అదేవిధంగా ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి, అడ్డంకులను తగ్గించడానికి మైనింగ్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయడానికి పరిశ్రమ నుంచి మరిన్ని సూచనలు కూడా కోరింది.

గనుల కేటాయింపు కోసం 2015లో వేలం విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి చేపట్టిన నిరంతర ప్రయత్నాలలో భాగంగా జరిగిన ఈ సమావేశం బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన మైనింగ్‌కు భారతదేశాన్ని ఒక ప్రపంచ కేంద్రంగా నిలపాలన్న మంత్రిత్వ శాఖ క్రియాశీలక విధానాన్ని ప్రతిబింబిస్తుంది. దేశ ఆర్థిక వృద్ధికి, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే పారదర్శకమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన, ఆవిష్కరణలతో కూడిన వ్యవస్థను ప్రోత్సహించడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

## వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు : తాసీల్దార్ ఆంజనేయులు

నల్గొండ, ఆగషు 8:వర్షాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆలేరు తాసీల్దార్ ఆంజనేయులు అధికారులకు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆలేరు మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా శుక్రవారం మండల స్థాయి అధికారులతో తాసీల్దార్ కార్యాలయంలో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యంగా వర్షాలకు ఎక్కడైనా రోడ్లు, భవనాలు, నివాస గృహాలు, చెరువులు, కుంటలు దెబ్బతినే ప్రమాదాలు ఉంటే ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్కూలు, అంగన్‌వాడీ సెంటర్లు ఏవైనా పాతవి ఉన్నట్లయితే, విద్యార్థులను గ్రామ పంచాయతీ భవనాలకు గానీ లేదా ఇతర ప్రభుత్వ భవనాలకు గానీ మార్చాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో కూలిపోయే దశలో ఉన్న పాత నివాస గృహాలు ఏవైనా ఉన్నట్లయితే అందులో నివసిస్తున్న వారిని కూడా సురక్షితమైన ప్రాంతాలకు, ప్రభుత్వ భవనాలకు తరలించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్య ఆంజనేయ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్, ఏఈ ఇరిగేషన్ విజయ్ కుమార్, ఎంపిఓ అనురాధ, శోభారాణి సీహెచ్ఓ, ఏపీఎం సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆండాలు, ఏఈఓ శివ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : మున్సిపల్ కమిషనర్ సుదర్శన్



నల్గొండ, ఆగషు 8: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు, వివిధ విభాగాల సిబ్బందికి బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందంచే శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుధ్య సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వైద్యుల సూచనలు పాటించాలన్నారు. అనంతరం కార్మికులకు బి.పి, షుగర్, హిమోగ్లోబిన్, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, మున్సిపల్ మేనేజర్ రాకేశ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సక్రు నాయక్, మెప్మా టీఎంసీ జగమంతు, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, భవాని, కవిత, మున్సిపల్ సిబ్బంది రవికుమార్, రమాకాంత్, జవాన్ శరత్, పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## 100% ఎఫ్‌డీఐ, కొత్త స్టేషన్లు, విధాన సంస్కరణలతో ఎల్ఎన్‌జీ వినియోగానికి ఊతం

న్యూఢిల్లీ, ఆగష్టు 8:దేశీయంగా సహజవాయు ఉత్పత్తి, ద్రవీకృత సహజవాయు (ఎల్ఎన్‌జీ) దిగుమతి ద్వారా దేశంలో సహజవాయువు అవసరాలు తీరుతున్నాయి. గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పలు రంగాలకు ఎల్ఎన్‌జీని విశేషంగా అందుబాటులోకి తెచ్చింది. దీనితోపాటు ఎల్ఎన్‌జీ టర్మినళ్లు, ఎల్ఎన్‌జీ దిగుమతుల కోసం సార్వత్రిక ఉమ్మడి లైసెన్సింగ్ (ఓపెన్ జనరల్ లైసెన్సింగ్– ఓజీఎల్) కేటగిరీ మొదలైనవి సహా.. ఎల్ఎన్‌జీ మౌలిక సదుపాయాలను నెలకొల్పడానికి పూర్తి ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడం కూడా ఇందులో భాగంగా ఉంది. ఇప్పటి వరకు 52.7 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 8 ఎల్ఎన్‌జీ రీగ్యాసిఫికేషన్ టెర్మినళ్లు పనిచేస్తున్నాయి.

స్వర్ణ చతుర్భుజి, జాతీయ రహదారులు, తూర్పు–పశ్చిమ హైవే, ఉత్తర–దక్షిణ హైవే, దేశంలోని ప్రధాన మైనింగ్ క్లస్టర్లలో ఎల్ఎన్‌జీ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, గ్యాస్ కంపెనీలు ఇప్పటివరకు 13 ఎల్ఎన్‌జీ రిటైల్ స్టేషన్లను ప్రారంభించాయి. ప్రైవేటు సంస్థలకు చెందిన 16 ఎల్ఎన్‌జీ రిటైల్ స్టేషన్లు కూడా పనిచేస్తున్నాయి.

రవాణా ఇంధనంగా ఎల్ఎన్‌జీ వినియోగాన్ని పెంచడం కోసం ఈ చర్యలు తీసుకుంది: – ఎల్ఎన్‌జీని రవాణా ఇంధనంగా ప్రభుత్వం గుర్తించింది. దీనికి సంబంధించి ఎల్ఎన్‌జీ వాహనాలకు ఉద్గార ప్రమాణాలను కూడా ప్రకటించారు.

స్టాటిక్ అండ్ మొబైల్ ప్రెజర్ వెసెల్స్ (అన్‌ఫైర్డ్) (అమెండ్‌మెంట్) రూల్స్–2025ను ప్రభుత్వం సవరించి.. విద్యుత్ జ్వలన యంత్రం లేదా సంపీడన జ్వలన తరహా అంతర్దహన యంత్రం (కంప్రెషన్ ఇగ్నిషన్ టైప్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్) ఉన్న ఎల్ఎన్‌జీ ఇంధనంతో కూడిన నౌకలను ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేయడానికి, అలాగే రైల్వేలు, మైనింగ్, జలమార్గాలు, పరీక్ష ప్రయోగ శాలల వంటి రవాణాయేతర రంగాల్లో ఎల్ఎన్‌జీ మొబైల్ డిస్పెన్సింగుకు అనుమతించింది.

పెట్రోలియం, సహజవాయువు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) 2020లో జారీ చేసిన ఓ ప్రకటనలో.. పీఎన్‌జీఆర్బీ సీజీడీ అనుమతితో నిమిత్తం లేకుండా ఓ సంస్థ ఎల్ఎన్‌జీ ఆర్వో (రిటైల్ అవుట్‌లెట్)ను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించింది (అయితే రవాణా రంగానికి ద్రవస్థితిలో ఎల్ఎన్‌జీని పంపిణీ చేసే ఎల్ఎన్‌జీ స్టేషన్ల స్థాపన, నిర్వహణకు మాత్రమే ఇది వర్తిస్తుంది).

కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి శ్రీ సురేశ్ గోపీ లోక్‌సభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని అందించారు.

## ఓటర్ నమోదు మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

మెదక్ రూరల్ ఆగస్టు 08 : రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ తయారు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీ మ్యాపింగ్‌లో భాగంగా హవేలీ ఘన్పూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. వార్డులు వారీగా ఓటర్స్ మ్యాపింగ్ విధానాన్ని సంబంధిత జడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి పరిశీలించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో గ్రామపంచాయతీ ఓటర్ నమోదు మ్యాపింగ్ ప్రక్రియ ఎంపీడీవోల పర్యవేక్షణలో పంచాయతీ సెక్రెటరీ, కంప్యూటర్ ఆపరేటర్స్‌తో పగడ్బందీగా కొనసాగుతుందని చెప్పారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు రూపొందించిన ఓటర్ల జాబితాను టీపోల్ యాప్‌లో నమోదు చేసేందుకు ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఒక లాగిన్ ఐడీ, పాస్‌వార్డును అందించారన్నారు. కొత్తగా ఏర్పడిన ఒక్కో పంచాయతీలో ఆరు వార్డులకు తగ్గకుండా ఓటర్లను విభజించాలని అందులోనూ ఒక కుటుంబం ఒక వార్డులోనే ఉండేలా నమోదు చేయాలన్నారు.

## తల్లీకూతుళ్ల దారుణహత్య..

జనగామ, ఆగష్టు 8: తెలంగాణ లోని జనగామ జిల్లా లో మానవత్వాన్ని కంటతడి పెట్టించే విధంగా ఒక దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇద్దరు మహిళలు అత్యంత దారుణ హత్యకు గురయ్యారు. తమ్మడపల్లి గ్రామంలో ఓ తల్లీకూతుళ్లు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి, నిష్టూరంగా పొడిచి, తలలు పగలగొట్టి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తమ్మడపలి గ్రామానికి చెందిన తల్లీకూతుళు గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తల్లి (75), కుమార్తె (45)ను గుర్తుతెలియని దుండగులు చంపేసి, పారిపోయారు.

తమ్మడపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఇద్దరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇద్దరిని కత్తులతో పొడిచి తలలు పగలగొట్టి కిరాతకంగా చంపేశారు. శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి అలికిడి రాకపోవడంతో అనుమానంతో స్థానికులు ఇంట్లో చూడగా ఇద్దరూ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిసరాలను తనిఖీ చేశారు.

దగ్గరలో ఉన్న సీసీ కెమెరాలను జల్లడపడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు . ఆస్తి తగాదాలతోనే ఈ హత్యలు చోటుచేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తల్లీకూతుళ్ల హత్య తో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది

## తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 8:వచ్చేది తెలంగాణలో మన రాజ్యమేనని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి కీసర మండల బీఆర్ఎస్ నేతలు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి మున్సిపాల్టీలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం చర్చించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో కీసరగుట్ట మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు రాగుల రమేశ్ ముదిరాజ్ జన్మదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. రమేశ్‌ను ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మల్లాడుతూ ప్రజలంతా కాంగ్రెస్ పాలనకు విసిగెత్తి పోతున్నారని, తెలంగాణలో వచ్చేది మన బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. పార్టీ కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, కార్యకర్తల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, నేతలు రాగుల రమేశ్ ముదిరాజ్, చినింగని బాల్‌రాజ్, తుడుం ఆగమయ్య, పండుగ రాజలింగం, భాస్కర్, ముత్యాలు, ఎర్‌సీఎం ప్రకాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఈత చెట్ల పెంపకంతో గీత కార్మికులకు ఉపాధి : ఎక్సైజ్ సీఐ మల్లయ్య

నల్గొండ, ఆగషు 8:ఈత చెట్ల పెంపకంతో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని నకిరేకల్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్ రావు అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఈదులూరు గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వారు ఈత మొక్కలను నాటి, గీత కార్మికులకు 2 వేల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటిన ఈత మొక్కలను ఎండిపోకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండలంలో 5 వేల మొక్కల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వన మహోత్సవ కార్యక్రమంలో గీత కార్మికులకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో పాటు ఈత వనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రెండు రోజుల పాటు ఈత మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని, గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కడెం రాంమోహన్, ఈసీ వెంకన్న, ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి యాదగిరి, ఎక్సైజ్ సిబ్బంది జావిద్, సైదులు, గీత కార్మికులు, గౌడ సంఘం సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

న్యూఢిల్లీ, ఆగష్టు 8: 'రోడ్డు ప్రయాణంలో ప్రమాదానికి గురైన వారికి నగదు రహిత చికిత్స పథకం –2025'ను ఈ ఏడాది మే 5వ తేదీ నాటి ఎస్.ఒ. 2015 (ఈ) తో అఖిల భారత స్థాయిలో నోటిఫై చేశారు. ఈ పథకం మార్గదర్శకాలను ఇదే ఏడాది జూన్ 4 న ఎస్.ఒ. 2489 (ఈ) లో భాగంగా నోటిఫై చేశారు. మోటారు వాహనాన్ని నడుపుతున్న కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదం బారిన పడ్డ ఏ వ్యక్తికైనా దేశమంతటా ఏ నిర్దేశించిన ఆసుపత్రిలోనైనా.. దుర్ఘటన తేదీ నాటి నుంచి గరిష్ఠంగా 7 రోజుల లోపల.. బాధితుల్లో ప్రతి ఒక్కరికి రూ. 1.5 లక్షల వరకు చికిత్స చేయించుకునే హక్కును ఈ పథకం ద్వారా కల్పించారు.

ఈ పథకం ఆయుష్మాన్ భారత్ – ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ–పీఎం–జేఏవై) పరిధిలోకి రాదు. అయినప్పటికీ ఇది ఒక చట్టబద్ధ పథకం. ఈ కారణంగా ఇది రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో న్యాయబద్ధమైన, నగదు చెల్లించనక్కరలేని ప్రమాదవేళ సంరక్షణ సంబంధిత సేవలను అందిస్తుంది. ఈ పథకం రిజిస్ట్రేషన్, తనిఖీ, క్లెయిము పరిష్కారం కోసం జాతీయ ఆరోగ్య ప్రాధికరణ సంస్థ (నేషనల్ హెల్త్ అథారిటీ)కి చెందిన ఐటీ ప్లాట్ ఫామ్ ను ఉపయోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తుంది. దీంతో, కాగితాలను సమర్పించనక్కరలేకుండా, సమర్థ సేవలను అందించడానికి వీలవుతుంది. ప్రస్తుత ఆసుపత్రుల నెట్‌వర్కును, సూచించిన ఆరోగ్య ప్రయోజనాల ప్యాకేజీలను ఉపయోగించుకొంటూ ఈ పథకం అత్యవసర పరిస్థితుల్లో సంరక్షణ సంబంధిత సేవల్ని నిరంతరాయంగా అందించడంతో పాటు పోర్టబులిటీకి, ఆర్థిక రక్షణకు కూడా వెసులుబాటు కల్పిస్తోంది.

నియమాలను ఉల్లంఘించిన మోటారు వాహనానికి బీమా సదుపాయం ఉన్న కేసుల్లో, సాధారణ బీమా కంపెనీలందించే కంట్రిబ్యూషన్లతో సంయుక్త పద్ధతిలో ఈ పథకానికి ఆర్థికసహాయాన్ని అందిస్తారు. బీమా ఉన్న మోటారు వాహనాలు కాకుండా ఇతర మోటారు వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించిన కేసుల్లో అయితే, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా సహాయాన్ని అందిస్తుంది. బీమా సహిత కేసులు కాకుండా ఇతర కేసుల్ని దృష్టిలో పెట్టుకొని, 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ. 272 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ఈ సమాచారాన్ని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ జైరాం గడ్కరీ లోక్‌సభకు రాతపూర్వకంగా ఇచ్చిన ఒక సమాధానంలో తెలిపారు.

# వరలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ..



–అట్టహాసంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు.
–ఇంద్రకీలాద్రిపై సరికొత్త శ్రావణ శోభ
–సువర్ణ శోభితంగా అమ్మవారి ఆలయ అలంకరణ
–భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
–పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళ భక్తులు
–అమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు..
–కిటకిటలాడుతున్న క్యూ లైన్లు
–అన్ని మార్గాల ద్వారా ఉచిత దర్శనం..
–భక్తులకు తాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ..

అమరావతి, ఆగష్టు 8: ముగ్గురమ్మల మూలపుటమ్మ కోరిన కోరికలు తెచ్చే కొంగుబంగారం.. వరము మహిమాన్వితమైన ఆ కనకదుర్గమ్మ వారు వరలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా సువర్ణ శోభితంగా పలు రకాల పూలతో అలంకరించారు. అమ్మవారి ప్రధానాలయంతో పాటు ఉప ఆలయాలు అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల పూలతో అలంకరించారు. వరలక్ష్మి దేవి అలంకరణలో ఉన్న కనకదుర్గమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రి కి తరలిరావడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసాయి. ప్రధానాలయంలో శ్రీ అమ్మవారు శ్రీ లక్ష్మి దేవిగా అలంకరణ చేసి, ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 9:30 నిమిషాల నుండి అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. క్రమక్రమంగా భక్తులు రాక పెరుగుతున్న పరిస్థితుల్లో రూ 100, 300, 500 టికెట్లను రద్దు చేసిన అధికారులు అందరికీ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు.

అలాగే అంతరాలయ దర్శనాన్ని రద్దుచేసి బంగారు వాకిలి ద్వారా అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఎండ తీవ్రత కాస్త ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల లో తాగునీరు అందించడంతో పాటు, చల్లటి మజ్జిగ ప్యాకెట్లను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించినందుకు చర్యలు తీసుకున్న అధికారులు అసిస్టెంట్ కమిషనర్ రంగారావు సారధ్యంలో పూర్తి అప్రమత్తతతో సామాన్య భక్తులకు శీఘ్రదర్శనం జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వకుండా భక్తులకు త్వరగా అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ప్రారంభమైన పవిత్రోత్సవాలు

విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గ మల్లేశ్వరి స్వామి వార్ల దేవస్థానంలో పవిత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 8వ తేదీ నుండి 29వ తేదీ వరకు మూడు రోజులు పాటు నిర్వహించే ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా పాత యాగశాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మొదటిరోజు శుక్రవారం స్థానాచార్యులు వి.శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు వైదిక కమిటీ సభ్యులు పవిత్రలకు తొలి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శీనా నాయక్ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం మంత్రోచ్ఛరణల మధ్య పవిత్ర మాలలను అమ్మవారితో పాటు ఉప ఆలయాల్లోని దేవత మూర్తులకు అలంకరించారు.

ఏడాది పొడవునా ఆలయంలో జరిగిన అపచారాలు పూజలలో లోపాలు, దోషాలను నివారించేందుకు ఈ వార్షిక పవిత్రోత్సవాలను నిర్వహిస్తుంటారు. దోష నివారణ లోపాలను సరిచేయడం సర్వ యజ్ఞ ఫలప్రద అన్ని యజ్ఞల ఫలితాలను పొందడం వంటి అనేక ప్రయోజనాలను ఈ పవిత్రోత్సవాలు సమకూరుస్తాయి. ఈ పవిత్రస్వాల్లో భాగంగా నలుపు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు రంగులతో పట్టు లేదా పత్తి దారాలతో తయారుచేసిన పవిత్రాలను వినియోగిస్తారు. పవిత్రాలు చెడు శక్తుల నుండి రక్షిస్తాయని నమ్మకం. పురాణాల ప్రకారం పవిత్ర రోహణం అంటే ఈ పవిత్ర మూలాలను దేవతలకు అలంకరించడం. ఇది పవిత్రస్వాలలో అత్యంత ముఖ్యమైన ఆచారం. దేవస్థానంలో భక్తులకు ఆధ్యాత్మిక శుద్ధిని శాంతిని అందించడంతో పాటు లోక కళ్యాణాన్ని కోరుతూ ఈ పవిత్రోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు.

## ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే బాలు నాయక్



నల్గొండ, ఆగషు 8:దేవరకొండ నియోజకవర్గంలో ఉన్న వివిధ మండలాలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

పూర్తిచేసిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఖాతాలో బిల్లులు జమ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. హౌసింగ్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించాలన్నారు. ఇంకా పూర్తి చేయని వారికి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తయిన వారికి బిల్లు చెల్లించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, వివిధ మండలాల తాసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఎత్తివేత

### – మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్ ఆగష్టు 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గత రెండు రోజుల నుంచి జిహెచ్ఎంసి పరిధిలో భారీ వర్షాలు కురువడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీనితో హిమాయత్‌సాగర్‌కు వరద ఉధృతి పెరుగుతోంది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయికి చేరిన నీటి మట్టం పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. మూసీ పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరిక జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

## నిండు కుండలా హుస్సేన్ సాగర్.. 513 మీటర్లకు చేరిన నీటిమట్టం

హైదరాబాద్, ఆగష్టు 8: గురువారం రాత్రి హైదరాబాద్ వ్యాప్తంగా వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. దీంతో హైదరాబాద్ నగరం నలు వైపులా వరద పోటెత్తింది. కూకట్‌పల్లి, ఖైరతాబాద్, బేగంపేట్ వైపు నుంచి వరద నీరు భారీగా హుస్సేన్ సాగర్‌కు వచ్చి చేరింది. దీంతో హుస్సేన్ సాగర్ నిండు కుండలా మారింది.

హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 514 మీటర్లు కాగా, శుక్రవారం ఉదయం 11 గంటలకు సాగర్ నీటిమట్టం 513.63 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం హుస్సేన్ సాగర్‌కు 1234 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ఔట్ ఫ్లో 1523 క్యూసెక్కులుగా ఉంది. ఈ క్రమంలో హుస్సేన్ సాగర్ దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



